క్లుప్తంగా

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

రంగంపేట: ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్య కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంఈఓ-1 కోసు శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం వచ్చే విద్యా సంవత్సరానికి గాను మండలంలోని 25 శాతం అనాథలు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల్లోని పేదలకు ప్రైవేట్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ప్రవేశానికి ఉత్తర్వులు వెలువడ్డాయని తెలిపారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్ కార్డు ద్వారా ప్రాథమిక వివరాలతో సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని లేదా విద్యార్థుల తల్లిదండ్రులు తమ గ్రామ సచివాలయం, మండల విద్యా వనరుల కేంద్రం, లేదా సంబంధిత పాఠశాల నుంచి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 23 నుంచి మార్చి 14 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పెదపూడి: ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని మండల విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం పెదపూడిలో ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, మండల విద్యా వనరుల శాఖ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

మెడికల్ టెక్నాలజీపై అవగాహన అవసరం


డాక్టర్ జితేంద్రశర్మ

రాజానగరం: మెడిసిన్‌తో పాటు మెడికల్ టెక్నాలజీపై కూడా పూర్తి అవగాహన ఉన్నవారే మంచి వైద్యులుగా రాణించగలరని విశాఖపట్టానికి చెందిన ఆంధ్ర మెడికల్ టెక్ జోన్ ఎండీ డాక్టర్ జితేంద్రశర్మ అన్నారు. జీఎస్ఎల్ వైద్య కళాశాలలో శుక్రవారం సాయంత్రం జరిగిన 16వ స్నాతకోత్సవం (కాన్వకేషన్)లో 2018 బ్యాచ్‌కి చెందిన 140 మంది ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్లకు డిగ్రీలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో యువ వైద్యులను ఉద్దేశించి డాక్టర్ జితేంద్రశర్మ మాట్లాడుతూ సమాజంలో వైద్యవృత్తికి ఉన్న కీర్తి ప్రతిష్ఠలను మరింత పెంపొందించేలా నడుచుకోవాలన్నారు. శ్రీలంకలోని పెరండేనియా యూనివర్సిటీ డెంటల్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ జయసింఘే అట్టిగళ మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు, బదలాయింపులకు ప్రపంచ దేశాల మధ్య ప్రస్తుతం ఎటువంటి హద్దులు లేవన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, సూపరింటిండెంట్ డాక్టర్ శ్రీహరిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సాయినాథుని ఆలయ వార్షికోత్సవం

బిక్కవోలు: బలభద్రపురంలో ఆంధ్రా షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి శుక్రవారం తెలిపారు. శనివారం తెల్లవారుజామున 5.15 గంటలకు కాకడ హారతితో వేడుకలు ప్రారంభమవుతాయని అన్నారు. అనంతరం గణపతి పూజ, గణపతి హోమం, దత్తాత్రేయ పూజ, ధుని పూజ జరుగుతాయన్నారు. బాబావారి మూలవిరాట్‌కు 108 లీటర్ల పాలతో అభిషేకం చేస్తామన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి బాబావారి గ్రామోత్సవం ఉంటుందన్నారు. రాత్రి బాబా మందిరం వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

రైతు కూలీల ప్రదర్శన

రాజానగరం: కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, వివిధ ప్రజా సంఘాలు సంయుక్తంగా ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా శుక్రవారం చేపట్టిన పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్ నియోజకవర్గంలో పెద్దగా ప్రభావం చూపలేదు. అయితే రాజానగరంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రదర్శన నిర్వహించారు. అన్నదాన సత్రం ప్రాంగణం నుంచి గాంధీ బొమ్మ సెంటర్, బస్టాండ్, పోలీసు స్టేషన్, సాయిబాబా గుడి సెంటర్ వరకూ ప్రదర్శన సాగింది. గాంధీ బొమ్మ సెంటర్‌లో కొద్దిసేపు మానవహారంగా ఏర్పడ్డారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను తూర్పారపట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. దేశాన్ని విదేశాలకు, సామ్రాజ్యవాద కంపెనీలకు ధారాదత్తం చేసేలా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు ఆరోపించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

పెదపూడి: ప్రతి కార్మికునికి కనీస వేతనంగా రూ.26 వేలు అందించాలని మండల అంగన్వాడీ కేంద్రాల సమాఖ్య అధ్యక్షురాలు, జిల్లా సీఐటీయూ ప్రతినిధి ఎం.రాజేశ్వరి అన్నారు. పెదపూడి మార్కెట్ సెంటర్లో కార్మిక కర్షక ఐక్యత దేశవ్యాప్త సమ్మెలో భాగంగా వివిధ సంఘాల కార్మికులతో శుక్రవారం బహిరంగ సభ నిర్వహించారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. రాజేశ్వరి మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఖండిస్తున్నామన్నారు. అన్ని రకాల వస్తువులపై జీఎస్టీ రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు వాసపల్లి శివ, ఇతర సంఘాల ప్రతినిధులు వి.ఉమావతి, జి.ఈశ్వరమ్మ, కనకదుర్గ, డి.మేరీరత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష నారాయణుడికి ప్రణామం

- జి.మామిడాడలో ఆధ్యాత్మిక సందడి
- మార్మోగిన సూర్యనారాయణ నామస్మరణ


ఆకట్టుకున్న కేరళ డప్పు వాయిద్యాలు


జి.మామిడాడలో స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ఆరోగ్య కారకుడు సూర్యనారాయణ స్వామి నామస్మరణతో శుక్రవారం జి.మామిడాడ మార్మోగింది. గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయం రథసప్తమిని పురస్కరించుకుని భక్తులతో కిక్కిరిసింది. వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. మధ్యాహ్నం స్వామివారి రథోత్సవం కనుల పండువగా సాగింది. ప్రత్యేక డప్పు వాయిద్యాలు, చిన్నారులు, బాలురు, బాలికలతో ప్రదర్శించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. స్వామివారిని దర్శించుకోవడానికి ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. సూర్యదేవుడికి ప్రీతికరమైన పొంగలిని భక్తులు వేరు పిడకలపై తయారు చేసి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. భక్తులకు పాలు, బిస్కెట్లు, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. రథసప్తమి సందర్భంగా స్వామివారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తిసూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి దర్శించుకుని రథోత్సవాన్ని ప్రారంభించారు. తొలుత వారికి ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూర్యనారాయణ స్వామిని కొలిస్తే సకల శుభాలు కలుగుతాయన్నారు. ఎంపీపీ కేతా తులసి, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ కొవ్వూరి శ్రీనివాస బాలకృష్ణారెడ్డి, ఆలయ ఈఓ మోర్త మురళీ వీరభద్రరావు తదతరులు పాల్గొన్నారు.


దేవతామూర్తి వేషధారణ వద్ద మహిళలు


జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో సూర్యభగవానుడు


పందలపాకలో భావనారుషి కల్యాణం చేస్తున్న గోవిందు, దేవి దంపతులు

కల్యాణోత్సవాల కరపత్రం ఆవిష్కరణ

జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన పెదపూడి మండలం పుట్టకొండలోని లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణం ఈ నెల 20న జరగనున్న నేపథ్యంలో ఆ కల్యాణ కరపత్రాన్ని ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయంలో ఈ నెల 10 నుంచి అధ్యాయన ఉత్సవాలు ప్రారంభించారన్నారు. 20న లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం, కల్యాణం జరుగుతుందన్నారు. ఆలయ ఈఓ సీహెచ్‌వీ రమణమూర్తి, సర్పంచ్ వల్లు వెంకటరమణ, ఉప సర్పంచ్ మిరియాల శ్రీను, కైకవోలు సర్పంచ్ నూని పట్టాభిరామన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భావనారుషి కల్యాణం

బిక్కవోలు: పందలపాకలో కొలువైన భద్రావతీ సమేత భావనారుషి స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవానికి కర్తలుగా పంపన గోవిందు, దేవి దంపతులు వ్యవహరించారు. అర్చకులు గరిమెళ్ల గాంధీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

రైతు నేస్తాల్లా సహకార సంఘాలు

- డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి
- పొలమూరులో సహకార సంఘ భవనం ప్రారంభం


సహకార సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ వీర్రాజు, ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా రైతులకు అన్ని సేవలు అందిస్తున్న వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతు నేస్తాలుగా నిలుస్తున్నాయని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పొలమూరులో ఎమ్మెల్యే తండ్రి సత్తి గంగిరెడ్డి పేరుపై రూ. 45 లక్షలతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ భవనాన్ని శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలు సర్వతోముఖాభివృద్ధి సాధించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని చర్యలూ తీసుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సొసైటీలకు పూర్వవైభవం వచ్చిందన్నారు. గత టీడీపీ హయాంలో సొసైటీలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. హమాలీ చార్జీల పేరుతో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నియోజకవర్గంలోని వివిధ సొసైటీల్లో దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. మంచి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని తిరిగి గెలిపించాలని ఆయన కోరారు. జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, వెంకటరెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ గుడాల ధనలక్ష్మి, జెడ్పీ మాజీ ప్రతిపక్ష నాయకులు సత్తి రామారెడ్డి, ఉప సర్పంచ్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సత్తి సూరారెడ్డి పాల్గొన్నారు. మహేంద్రవాడలో డీఎంఎఫ్ నిధులు రూ. 10 లక్షలతో నిర్మించిన వైఎస్సార్, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి వాకింగ్ ట్రాక్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ప్రారంభించారు. గ్రామంలోని లక్ష్మీదేవి చెరువు గట్టు వద్ద వాకింగ్ ట్రాక్ నిర్మించిన ఎంపీటీసీ సబ్బెళ్ల వెంకటరెడ్డి (కొండ), కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. సర్పంచ్ మల్లిడి జయప్రభ గంగరాజు, కొమరిపాలెం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ జలకళతో మెట్ట సస్యశ్యామలం

రంగంపేట: వైఎస్సార్ జలకళ పథకంతో రంగంపేట మండలం సస్యశ్యామలం అవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద వైఎస్సార్ జలకళ పథకంలో భాగంగా మండలంలోని 48 మంది రైతులకు ఉచితంగా మోటార్లు, పంపు సెట్లు, ట్యూబ్‌లు, ఎలక్ట్రికల్ వైర్లను ఎమ్మెల్యే అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జలకళ పథకంలో మండలంలో 475 మంది రైతులకు బోర్‌వెల్స్ మంజూరయ్యాయన్నారు. 217 మంది రైతులకు మోటార్లు మంజూరు కాగా 152 మోటార్లు పంపిణీ చేశామన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర రైతు, చేనేత విభాగాల కార్యదర్శులు పాలాటి నాగేశ్వరరావు, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు, సొసైటీ చైర్మన్ పోతుల బులి వీర్రాజు, మండల జేఏసీ కన్వీనర్ మేడిశెట్టి రవిశంకర్ పాల్గొన్నారు.

సమాజానికి, రాష్ట్రానికి వెన్నెముక బీసీలే

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- కమ్యూనిటీ హాలు స్థలం పత్రాల పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాష్ట్రంలో బీసీలు వెనుకబడిన కులాలు కాదని, ప్రభుత్వానికి, రాష్ట్రానికి, సమాజానికి వెన్నెముక వంటి వారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని నాయీ బ్రాహ్మణుల విజ్ఞప్తి మేరకు వారి సంఘానికి ప్రయోజనం చేకూరేలా కమ్యూనిటీ హాలు నిర్మించుకునేందుకు రాజానగరంలో రెండు సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ఇందుకు సంబంధించిన పత్రాన్ని సంఘం పెద్దలకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే మేలు జరిగిందన్నారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉండగా సమస్యలు విన్నవించుకునేందుకు వెళ్లి సంఘ పెద్దలను తోలు తీస్తానంటూ అవమానించడాన్ని ఎవ్వరూ మరువలేదన్నారు. అయితే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా సమస్యలను జీవోల ద్వారా పరిష్కరిస్తూ, వారి ఆత్మాభిమానాలకు భంగం కలుగకుండా, విలువలను పెంచేలా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందన్నారు. పిల్లి సుభాష్‌చంద్రబోస్, మస్తాన్‌రావు, ఆర్.కృష్ణయ్య, మోపిదేవి వెంకటరమణ వంటి ఎందరినో రాజ్యసభకు పంపించి గౌరవించిందన్నారు. క్యాబినెట్‌లో 67 శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అవకాశం ఇవ్వడమే కాకుండా స్థానిక సంస్థలు, కార్పొరేషన్, నామినేటెడ్ పదవులలో 50 శాతం వీరికే దక్కేవిధంగా చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ధన్వంతరీ నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుందరంపల్లి గోపాలకృష్ణ మాట్లాడుతూ తమ సంఘీయుల విజ్ఞప్తి మేరకు రాజానగరం నియోజకవర్గంలోని మూడు మండలాలలోనూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్థలాలను కేటాయించారన్నారు. తమ కులస్తుల సంక్షేమంతో పాటు సమస్యల పరిష్కారంలోనూ జీఎం జగన్ ఎంతో శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామి నాయుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, ఉండమట్ల రాజబాబు, గంధం నారాయణరావు, కొండపల్లి దుర్గారావు, సర్పంచ్ కుందేటి ప్రసాద్, ఉపసర్పంచ్ కొల్లి వీర్రాజు, వార్డు సభ్యుడు ప్రగడ చక్రి, ధన్వంతరీ నాయీబ్రాహ్మణ సంఘం మండల శాఖ అధ్యక్షుడు ఏలేటి మల్లేశ్వరరావు, కార్యదర్శి పసలపూడి ప్రకాశరావు, కడియపు పోశారావు, రాష్ట్ర కోశాధికారి మల్లిమొగ్గల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు

సీతానగరం: రాజానగరం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. వంగలపూడిలో సీసీ రోడ్డుకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు అడిగిన మేరకు రోడ్లు, సీసీ డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. వంగలపూడి పంచాయతీకి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.40 లక్షలు వచ్చాయన్నారు. సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఎంపీటీసీ సూరెడ్డి గంగాభవాని, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కొంచ భాస్కరరావు, చల్లమళ్ల సుజీరాజు, సూరెడ్డి పోశారావు, నల్లనాగ రాజారావు, పేరిచర్ల శ్రీనివాసరాజు, అంబటి రమణ పాల్గొన్నారు.

512 మందికి వైద్యసేవలు

సీతానగరం: రఘుదేవపురం సచివాలయం-2లో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 512 మందికి వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్లు ఎస్.రాజు, ఈ.ఏసురాజ్, స్పెషలిస్టులు భారతి, కంటి వైద్య నిపుణులు కె.సత్యప్రసాద్ వైద్యసేవలు అందించారు. 15 మందికి ఈసీజీ, 264 మందికి ల్యాబ్ టెస్టులు చేశారు. 66 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 45 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. గతంలో పరీక్షించిన 45 మందికి కళ్లజోళ్లు అందించారు. రోగులకు అవసరమైన మందులను ప్రభుత్వం అందించిన బ్యాగ్‌లలో ఉంచి సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల, ఉప సర్పంచ్ పట్టపగల విష్ణు ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు గెద్దాడ త్రిమూర్తులు, సుంకర సూర్యచంద్రం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అప్పారావు, సీహెచ్‌వో వెంకటరత్నం, ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, సూపర్‌వైజర్ కె.సుధాకర్, జి.దైవకృప పాల్గొన్నారు.

కార్మికుల ఆందోళన

బిక్కవోలు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బ్లూక్రాఫ్ట్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ కార్మికులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలభద్రపురం శివారు ప్రాంతం కానేడులోని బ్లూక్రాఫ్ట్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ గుజరాత్ రాష్ట్ర యాజమాన్యం అక్రమ లేఆఫ్ పేరుతో పరిశ్రమలో ఉత్పత్తిని నిలుపుదల చేసిందన్నారు. ఈ నెల 22వ తేదీ తరువాత పరిశ్రమను మూసివేస్తామని చెప్పి, తమను బయటకు పంపి ఇతర రాష్ట్ర నుంచి కార్మికులను తీసుకొచ్చి పనిచేయించుకోవాలని చూస్తుందన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. న్యాయం జరిగే వరకూ రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామన్నారు.

సంతోషి మాత ఆలయ వార్షికోత్సవం

బిక్కవోలు: మండలంలోని తుల్యభాగ నదీ తీరాన వెలసిన శ్రీసంతోషి మాత అమ్మవారి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజ లు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నరసన్న ఆలయ అభివృద్ధికి చర్యలు


కోరుకొండ నరసింహస్వామి దేవాలయంలో అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- చిన జీయర్‌స్వామితో రేపు శంకుస్థాపనలు
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. చినజీయర్ స్వామీజీతో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరుగుతాయని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కోరుకొండలో అధికారులతో సమావేశమై మాట్లాడారు. నరసింహుని దేవాలయం, రంగనాథస్వామి ఆలయం, దేవుని కోనేరు, కాపవరంలోని ఫైర్ స్టేషన్ భవనాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆలయాభివృద్ధిలో భాగంగా ఐదు అంతస్తుల రాజగోపురం నిర్మాణానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు, కొండపైకి మెట్ల నిర్మాణానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. స్వామివారు కొలువుదీరిన కోరుకొండను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతానన్నారు. కొండపైకి మెట్ల నిర్మాణానికి అన్నవరం దేవస్థానం రూ.60 లక్షలు నిధులు కేటాయించిందని, దీనికి ట్రస్టు సభ్యురాలు తాడి రజనీరెడ్డి కృషి చేశారన్నారు. అలాగే రుడా సహకారంతో రూ.50 లక్షలతో దేవుని కోనేటిని అందంగా పార్కు తరహాలో తీర్చిదిద్దుతామన్నారు. రూ. 210 కోట్లతో గోదావరి నీటిని ప్రజలకు అందించేందుకు కృషిచేస్తున్నట్టు, రూ.కోట్ల నిధులతో సీతానగరం నాలుగు లేన్ల రహదారిని నిర్మించినట్టు తెలిపారు. కోరుకొండ అభివృద్ధికి రూ.3.80 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. తాను, తన కుటుంబ సభ్యులపై వస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. 2024 ఎన్నికలలోలో కూడా ఆస్తుల వివరాల అఫిడవిట్‌ను సమర్పిస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలనే కోరుకొండలో నివాసం ఏర్పాటు చేసుకున్నానన్నారు. ఆదివారం జరిగే కార్యక్రమాలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణు, హోం మంత్రి తానేటి వనిత హాజరవుతారన్నారు. కార్యక్రమంలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త ఎస్వీ రంగరాజ బట్టర్, అన్నవరం దేవస్థానం ఈఓ రామచంద్రమోహన్, రుడా డీఈ టి.చంద్రశేఖరరావు, ఏఈ దుర్గాప్రసాద్, పంచాయతీరాజ్ శాఖ డీఈ ఏ.రవి, కోరుకొండ ఎంపీడీఓ హేమసుందరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.96.30 లక్షలు

అనపర్తి: బిక్కవోలు, అనపర్తి, రంగంపేట మండలాల పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు గాను రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ (రుడా) నుంచి రూ. 96.30 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. అనపర్తి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో సుందరీకరణ పనులకు రూ. 38 లక్షలు, అనపర్తిలోని ఓసీ శ్మశాన వాటిక వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు రూ.15 లక్షలు, కొమరిపాలెంలో గ్రీనరీ పనులకు రూ. 27.70 లక్షలు, సుభద్రంపేటలో కోనేరు అప్రోచ్, సుందరీకరణకు సంబంధించి రూ. 15.60 లక్షలు మంజూరైనట్లు వివరించారు. ఈ నిధులు మంజూరు చేసిన రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

నేటి నుంచి వలంటీర్లకు అవార్డుల ప్రదానం

బిక్కవోలు: మండలంలో ఈ నెల 17 నుంచి 22 వరకూ వలంటీర్ల వందనం కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీఓ వి.విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఆమె మాట్లాడుతూ శనివారం ఉదయం పందలపాక సచివాలయం 1, 2, కాపవరం, మధ్యాహ్నం కొమరిపాలెం సచివాలయం 1, 2 పరిధిలో నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వలంటీర్లకు పురస్కారాలు అందిస్తారన్నారు. 19న ఊలపల్లి-1, 2 పరిధి, బలభద్రపురం 1, 2, 3 సచివాలయాలు, మెళ్లూరు, 20న తొస్సిపూడి, ఆరికరేవుల, ఇలపల్లి గ్రామాల్లోనూ, 21న రంగాపురం, 22న బిక్కవోలు 1, 2, 3, 4 సచివాలయాలు, కొంకుదురు 1, 2 పరిధిల్లో కార్యక్రమాలు ఉంటాయన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

బిక్కవోలు: విద్యార్థి దశ నుంచే కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలని సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. పందలపాక ప్రాథమిక మెయిన్ పాఠశాల వద్ద ప్రథమ ఇన్ఫోటెక్ ఫౌండేషన్, ఎస్ఏపీ, ఐటీసీ సహకారంతో డిజిటల్ ఎడ్యుకేషన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. ప్రథమ ఇన్ఫోటెక్ స్టేట్ హెడ్ జి.లోకరాజు మాట్లాడుతూ తమ ఫౌండేషన్ సహకారంతో పాఠశాలల్లో కంప్యూటర్ విద్య అందిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. హెచ్ఎం ద్వారంపూడి అప్పారెడ్డి, సోమేశ్వరశర్మ, వీరాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, కో ఆర్డినేటర్ డి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

అనపర్తి: స్థానిక పద్మశ్రీ థియేటర్ వీధిలోని ఒక ఇంట్లో గంజాయి తాగుతున్న యువకులను అరెస్ట్ చేసి, వారి నుంచి 1.127 కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ వీధిలోని ఓ పెంకుటిల్లులో కొంతమంది యువకులు గంజాయి తాగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సీఐ శివగణేష్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో కర్రి అజయ్ గోపాలకృష్ణారెడ్డి, తాతపూడి దివాకర్‌తోపాటు మరో బాలుడు గంజాయితో దొరకగా జె.సాయి, పి.కార్తీక్ పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచారు. అనపర్తి, దుప్పలపూడి గ్రామాల్లో అధిక సంఖ్యలో యువకులు గంజాయికి అలవాటు పడినట్లు సమాచారం ఉందని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి సంబంధిత వ్యక్తులను త్వరలో అరెస్ట్ చేస్తామని సీఐ వివరించారు.

పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

బిక్కవోలు: ఊలపల్లి ఉన్నత పాఠశాలను కాకినాడ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (ఆర్జేడీ) జి.నాగమణి తనిఖీ చేశారు. శుక్రవారం పాఠశాల వద్ద పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు రాసే విధానంపై పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి, ఆహారం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 8, 9 తరగతి విద్యార్థులు ట్యాబ్‌లు వినియోగించాలని, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను తెలిపారు. పాఠశాల హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం

సీతానగరం: మాదక ద్రవ్యాలకు బానిసలైతే అమూల్యమైన జీవితం నాశనమవుతుందని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అన్నారు. ఆ కళాశాలలో శుక్రవారం నషా ముక్త భారత్ (మాదక ద్రవ్యాల నిరోధం)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు మాట్లాడుతూ స్కూల్ దశ నుంచి చక్కని క్రమశిక్షణతో, నైతిక బాధ్యతలు కలిగి ఉంటే ఇలాంటి వ్యసనాల బారి నుంచి తప్పించుకోవచ్చని అన్నారు. అధ్యాపకులు డాక్టర్ బీవీవీ నాగేశ్వరరావు, వీవీ సుబ్బారావు, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ఎం.సుధామయి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు.